# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి ప్రతిపక్షాలు మహిళల అభివృద్ధిని అడ్డుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు కేంద్రమంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.

- పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈరోజుతో ముగిశాయి.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

- హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు మహిళల అభివృద్ధి సాధికారతను అడ్డుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ కోసం తీసుకువచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో కొద్దిసేపటి క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న ప్రధానమంత్రి... నారీ శక్తి వందన అధినియమ్ సవరణకు సంబంధించిన చట్టం ఆమోదానికి ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ, విపక్షాలు వాటిని వ్యతిరేకించాయన్నారు. మహిళల హక్కులను, గౌరవాన్ని ప్రోత్సహించేందుకు తీసుకున్న ఆమోదయోగ్యమైన చర్యలకు విపక్షాలు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నాయన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రస్తుత ఎంతో అవసరమని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

నిరంతర సముద్రయాన బీమా కవరేజీ కోసం 12వేల 980 కోట్ల రూపాయలతో 'భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్' ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. సమావేశం అనంతరం సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రపంచ అస్థిరత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నౌకల బీమా కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. యుద్ధ ప్రమాదం వంటి అన్ని సముద్ర సంబంధిత నష్టాలను కూడా ఈ బీమా కవర్ చేస్తుందని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన మూడోదశ 2028 వరకు కొనసాగింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ పథకం కోసం 83వేల 977 కోట్ల రూపాయలను కేటాయించనున్నట్లు తెలిపారు. 24వేల 815 కోట్ల రూపాయల వ్యయంతో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లోని 15 జిల్లాలను కవర్ చేస్తూ రెండు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్…35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని, పెన్షనర్లకు కరువు ఉపశమనాన్ని 2 శాతం పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చే ఈ పెంపు.. ఉద్యోగులు, వారి కుటుంబాల ఆర్థిక భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీక అని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. 83 వేల 977 కోట్ల రూపాయల వ్యయంతో మూడు సంవత్సరాలు కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన-పథకం గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు (GrAMs), పాఠశాలలు, ఆసుపత్రులను మెరుగైన కనెక్టివిటీతో అనుసంధానించడానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ ఇంధన భవిష్యత్తుకు శక్తినిచ్చేందుకు భారత్ అనిశ్చితిని అవకాశంగా, డేటాను ఆవిష్కరణగా మారుస్తోందని పెట్రోలియం, సహజ వాయువుల శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. అన్వేషణలో భాగస్వామ్యాన్ని, పెట్టుబడులను వేగవంతం చేయడానికి భూకంప డేటానే ప్రాథమిక సాధనమని, ఈరోజు జరిగిన 'డేటా డ్రివెన్ ఎక్స్‌ప్లోరేషన్' సదస్సు పునరుద్ఘాటించిందని కేంద్రమంత్రి సామాజిక మాధ్యమంలో తెలిపారు. మరింత మంది మేధావులు విశ్లేషించడానికి, ఆవిష్కరించడానికి, కనుగొనడానికి వీలు కల్పించే పటిష్టమైన మల్టీ-క్లయింట్ డేటా ఎకోసిస్టమ్‌ను స్వాగతించడం ద్వారా, అన్వేషణ, ఉత్పత్తి రంగాన్ని భారతదేశం నిర్ణయాత్మకంగా మారుస్తోందని ఆయన అన్నారు. సముద్ర మంథన్ మిషన్‌తో, ఇంధన ఆత్మనిర్భరత లక్ష్యాన్ని నెరవేర్చడానికి, స్వేచ్ఛ, సహకారం, అత్యాధునిక విజ్ఞానంతో దేశ అపారమైన ఆఫ్‌షోర్ సామర్థ్యాన్ని వెలికితీస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు ఉభయ సభలు ఈరోజు నిరవధికంగా వాయిదా పడ్డాయి. దీనితో ఈ ఏడాది జనవరి 28న ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. లోక్ సభలో వీడ్కోలు ప్రసంగం చేసిన స్పీకర్ ఓం బిర్లా, ఈ బడ్జెట్ సమావేశాల్లో సభ 93 శాతం ఉత్పాదకతను నమోదు చేసిందని అన్నారు. ఈ సెషన్లో మొత్తం 41 సార్లు సభ సమావేశమైందని ఆయన తెలిపారు. మొత్తం 12 ప్రభుత్వ బిల్లులను ప్రవేశపెట్టగా, వాటిలో 9 బిల్లులు ఆమోదం పొందాయని ఓం బిర్లా పేర్కొన్నారు. వీటిలో ఫైనాన్స్ బిల్లు 2026, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ కోడ్ (సవరణ) బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2026, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) బిల్లు 2026 వంటి కీలక బిల్లులు ఉన్నాయని ఆయన వివరించారు.
అలాగే.. రాజ్యసభలో ముగింపు ప్రసంగంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ మాట్లాడుతూ, సభ మొత్తం 157 గంటలకు పైగా పనిచేసిందని ఈ సమావేశాల ఉత్పాదకత సుమారు 110 శాతంగా ఉందని తెలిపారు. పార్లమెంటు మూడు సెషన్లలో బడ్జెట్ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, ఇది సుదీర్ఘమైనది మాత్రమే కాకుండా దేశాభివృద్ధి పథాన్ని రూపొందించడంలో కీలకమైనదని ఆయన అన్నారు. సభలో చర్చలను సుసంపన్నం చేసిన సభ్యుల విలువైన అభిప్రాయాలను ఆయన అభినందించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ ఆసియా వివాదం వలన భారతదేశం ఎదుర్కొంటున్న ఇంధన సవాళ్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభలో ప్రకటన చేశారని సి.పి.రాధాకృష్ణన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు విజయవంతంగా జరిగాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ లైబ్రరీ భవనంలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ సమావేశాల్లో కేంద్ర బడ్జెట్‌తో పాటు పలు కీలక శాసన బిల్లులు విజయవంతంగా ఆమోదం పొందాయని తెలిపారు. సమావేశాల రెండవ దశలో, పశ్చిమ ఆసియా సంక్షోభంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉభయ సభలలో ప్రకటనలు చేశారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పేర్కొంటూ…

(వాయిస్…26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = =

హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన చెన్నై జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. 195 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చెన్నై జట్టు 1 ఓవర్ పూర్తయ్యేసరికి 15 పరుగులు చేసింది.
అంతకుముందు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో రాయల్ చాలెంజర్స్ జట్టుపై ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని (వరల్డ్ హెరిటేజ్ డే) జరుపుకుంటున్నారు. సాంస్కృతిక సహజ వారసత్వ సంపద వైవిధ్యం, వాటి సున్నితత్వం ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =